క్లుప్తంగా

అమ్మవారికి వెండి కిరీటం సమర్పణ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి ఆదివారం పట్టణానికి చెందిన వెంకటేశ్వర్లు, కుటుంబసభ్యులు 2.318 కేజీల బరువు గల రూ.2.25లక్షలు విలువైన వెండికిరీటాన్ని వితరణ చేశారు. దీనిని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వీకరించి దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి



ఆదిశంకరాచార్యులకు పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు జరిగాయి. ఆలయ ప్రాంగణంలోని బ్రహ్మగుడి ఆవరణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. ఆదిశంకరాచార్యుల చిత్రపటాన్ని ఉంచి పూలమాలలు వేసి విశేష పూజలు చేశారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకులు కరుణాకర్ గురుకుల్ పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో హెల్త్ అసిస్టెంట్



కూటమి ఎన్నికల ప్రచారంలో హెల్త్ అసిస్టెంట్ రమేష్ (వృత్తంలోని వ్యక్తి)

తిరుపతి తుడా: సార్వత్రిక ఎన్నికల ముగింపు ప్రచారంలో ప్రభుత్వ శాఖలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగి పాల్గొని కూటమి అభ్యర్థిని గెలిపించాలంటూ ప్రచారం చేశాడు. తిరుపతి నగరంలో శనివారం కూటమి తరపున బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, టీడీపీ నేత నారా లోకేష్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. స్థానిక గాంధీరోడ్డులో నిర్వహించిన ఎన్నికల ర్యాలీకి టీడీపీ నాయకుడు మబ్బు దేవనారాయణరెడ్డి ఇతర పార్టీ నాయకులతో కలిసి హెల్త్ అసిస్టెంట్ రమేష్ పాల్గొన్నారు. అందరితో ఆగకుండా టీడీపీ జెండా చేతబట్టి నినాదాలు చేయడం చర్చనీయాంశమైంది. చంద్రగిరి మండలం కొటాల పంచాయతీలోని పబ్లిక్ హెల్త్ సెంటర్‌లో రమేష్ కాంట్రాక్ట్ పద్ధతిలో హెల్త్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రమేష్పై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

గొప్ప తాత్వికవేత్త భగవద్ రామానుజులు



ఆచార్య కె.రాజగోపాలన్

తిరుపతి కల్చరల్: శ్రీవైష్ణవాన్ని, అష్టాక్షరి మంత్రంలోని అర్థాన్ని, సామాన్యులకు మోక్ష మార్గాన్ని ఉపదేశించిన గొప్ప తాత్వికవేత్తగా, సామాజిక సంస్కర్తగా భగవద్ రామానుజాచార్యులు నిలిచిపోయారని కేంద్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం ఆచార్యులు కె.రాజగోపాలన్ ఉద్ఘాటించారు. టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో మూడు రోజులుగా అన్నమాచార్య కళామందిరంలో చేపడుతున్న శ్రీరామానుజాచార్యుల అవతార మహోత్సవాలు ఆదివారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా ఆచార్య కె.రాజగోపాలన్ రామానుజాచార్యులు – తిరుమల కైంకర్యాలు అనే అంశంపై ఉపన్యసించారు. రామానుజాచార్యుల మేనమామ తిరుమలనంబి తిరుమల శ్రీవారికి నిత్య కైంకర్యాలు చేశారని, శ్రీఅనంతాళ్వారు పుష్ప కైంకర్యాలు నిర్వహించారని వివరించారు. అనంతరం అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు రాజ్యలక్ష్మి బృందం ఆలపించిన భక్తి సంకీర్తనలు భక్తులను అలరింపజేశాయి. ఈ కార్యక్రమంలో టీటీడీ ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ పురుషోత్తం, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృ దినోత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీకోదండరామాలయం దక్షిణ మాడా వీధిలోని చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రంలో ఆదివారం సాయంత్రం అంతర్జాతీయ మాతృ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలోని పలువురు మాతృమూర్తులను ఆహ్వానించి వారిని సముచిత రీతిన సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమానికి శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ చిత్రపు స్వరాజ్యలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తల్లి గొప్పతనాన్ని వివరించి మాతృమూర్తులను సన్మానించారు. చిగోరా ఆధ్యాత్మిక సేవా కేంద్రం వ్యవస్థాపకుడు చిత్రపు హనుమంతరావు జన్మదినం సందర్భంగా కేక్ కట్ చేసి అందిరికి పంచిపెట్టారు, హనుమంతరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. సేవా కేంద్రం సభ్యులు జయలక్ష్మి, రాజ్యలక్ష్మి, పద్మావతి, ప్రభావతి, రచయిత దూబగుంట రామకృష్ణ, రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, పలువురు మాతృమూర్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికే మా ఓటు

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించిన ప్రభుత్వానికి ఓటు వేసేందుకు అన్ని వర్గాల ప్రజలు సిద్ధమయ్యారు. ఐదేళ్ల పాలనలో కుల, మత, పార్టీలకతీతంగా అర్హత కలిగిన వారికి సంక్షేమ పథకాల్లో అవినీతి, అక్రమాలకు తావు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు చేర్చిన ఘనత ప్రస్తుత ప్రభుత్వానిదే. ఎన్నికల ముందు ఇచ్చిన నవరత్నాల హామీలతో పాటు చెప్పని హామీలను సైతం ప్రజల అవసరాలకు అనుగుణంగా అమలు చేసింది. దీంతో యావత్ భారతదేశం, ఆంధ్రప్రదేశ్ వైపు చూసింది. ఇంత గొప్ప పరిపాలన చేసిన ప్రస్తుత ప్రభుత్వానికే మా ఓటు వేసి మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటామని చెబుతున్నారు.

ఇదేకదా అభివృద్ధి

– సాక్షినెట్‌వర్క్

ప్రభుత్వం చేసిన సేవలు మరువం..



కరోనా కష్టకాలంలో అయిన వారే దగ్గరకు రాని దయనీయ పరిస్థితుల్లో ఈ ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఆదర్శనీయం. ప్రతి గ్రామంలో వలంటీర్ల ద్వారా ఫీవర్‌సర్వే చేయించి అనుమానితులను ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించి కరోనా వ్యాప్తి కట్టడికి పటిష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే మన రాష్ట్రంలో అమలైన నవరత్న పథకాల వల్ల పేదల జీవన విధానంలో మార్పులు వచ్చాయి. ప్రజలు మెచ్చే పాలన అందించిన వారికే అండగా నిలుస్తాం.

– హేమలత, చెంగారెడ్డి పట్టెడ

ప్రజాసంక్షేమం కోరే వారికే ఓటు..



గతంలో ఊరందూరు ఎస్టీ కాలనీ అభివృద్ధి జరగలేదు. ఈ ప్రభుత్వంలో నాడునేడుతో బడులు అభివృద్ధి చేశారు. ఆస్పత్రుల రూపురూఖలు మారాయి. సంక్షేమం, అభివృద్ధి పట్టించుకునే నేతకే మా ఓటు.

– రంగయ్య, ఊరందూరు ఎస్టీకాలనీ.

గ్రామాన్ని అభివృద్ధి చేశారు..



మా ఊర్లో నీలకంఠేశ్వరస్వామి ఆలయానికి 30 సంవత్సరాలుగా కుంభాభిషేకం నిర్వహించలేదు. గత ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక ఆలయానికి కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయాన్ని పట్టించుకోని వారు నియోజకవర్గాన్ని అభివృద్ధి ఏం చేస్తారు. సంక్షేమం, అభివృద్ధి పట్టించుకునే ప్రభుత్వానికే మా ఓటు.

– దిలీప్, ఊరందూరు

పేదల పాలిట పెన్నిధి



పేదల జీవితాలు మారాలని ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. మా లాంటి నిరుపేద కుటుంబాలకు సంక్షేమ పథకాలు ఎంతో అండగా నిలిచాయి. మేము ఇప్పుడు ఒక స్థాయిలో ఉన్నామంటే అది ఆయన చలవే. చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18,750 అందింది. డ్వాక్రా రుణమాఫీ జరిగింది. అలాగే నాకు పింఛన్ అందుతోంది. ఇంత అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వానికే ఓటు వేస్తాం.

– కాంతమ్మ, పెద్ద పాండూరు, వరదయ్యపాళెం మండలం

మహిళా సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యం



మహిళల సంక్షేమానికి అహర్నిశలు శ్రమించి, మమ్మల్ని ఆర్థికాభివృద్ధి చేసిన ప్రభుత్వానికే మద్దతుగా నిలబడతాం. ఎక్కడికి వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు అందించిన నాయకుడికే అండగా ఉంటాం. మహిళా సంక్షేమం ప్రస్తుత ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని మా నమ్మకం.

– రెడ్డి రిబ్కా, రాచర్ల, వరదయ్యపాళెం మండలం

అణగారిన వర్గాలకు సామాజిక భద్రత



మాలాంటి అణగారిన వర్గాల కోసం ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి మా కుటుంబాల్లో వెలుగులు నింపింది. మాలాంటి వారికి ఆర్థిక భద్రతతో పాటు సామాజిక భద్రత ఏర్పడింది. రేపటి ఎన్నికల్లో అభివృద్ధి చేసిన వారి విజయానికి చేకూర్చేందుకు మేమంతా సిద్ధంగా ఉన్నాం.

– వీరాస్వామి, వెంగారెడ్డికండ్రిగ, వరదయ్యపాళెం మండలం

రుణం తీర్చుకుంటాం



ప్రతి నెలా ఒకటో తేదీనే తెల్లవారుజామున వృద్ధాప్య పింఛన్ ఇంటికి తీసుకువచ్చి అందించింది. మాలాంటి వృద్ధులకు ప్రస్తుత ప్రభుత్వం ఎంతో మేలు చేసిందని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. రేపటి ఎన్నికల్లో నాలాంటి వృద్ధులంతా అలాంటి వారికే ఓటు వేసి రుణం తీర్చుకుంటాం.

– కురకయ్య, వరదయ్యపాళెం

బాబు మాటలు నమ్మొద్దు



ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని ప్రస్తుత ప్రభుత్వం తు.చ తప్పకుండా అమలు చేసింది. చంద్రబాబు చెబుతున్న సూపర్ సిక్స్ హామీలు ఒక్కటీ అమలు చేయలేదు. ఆయన చెబుతున్న హామీలన్నీ బూటకపు హామీలే. మాలాంటి రైతులందరూ అభివృద్ధికే అండగా నిలబడతాం.

– మునికృష్ణయ్య, రైతు, నాగలాపురం మండలం

పోలింగ్‌కు వేళాయె.. ఎన్నికలకు సర్వం సిద్ధం



పోలింగ్ సిబ్బంది

–ఎన్నికలను సర్వం సిద్ధం

శ్రీకాళహస్తి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం జరిగే పోలింగ్‌ను పురస్కరించుకుని స్కిట్ కళాశాల స్ట్రాంగ్‌రూమ్ నుంచి ఈవీఎంలను శ్రీకాళహస్తి ఆర్వో, ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆయా పోలింగ్‌స్టేషన్లకు సంబంధించి ఈవీఎంలను అందజేశారు. గట్టి బందోబస్తు నడుమ వాటిని నియోజకవర్గంలోని ఆయా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 293 బూత్‌లకు సంబంధించి ఎన్నికల అధికారులకు ఈవీఎంలను అందజేసి గట్టి బందోబస్తు నడుమ తరలిస్తున్నామన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు తమ విలువైన ఓటును సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

పోలీసులకు అవగాహన

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆదివారం స్కిట్ కళాశాల ఆవరణలో పోలీసులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్, డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి మాట్లాడుతూ పోలింగ్ బూత్‌ల వద్ద ఉండే పోలీసులకు ఎలాంటి కార్యాచరణ చేపట్టాలో వివరించామన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశాంత వాతావరణంలో ఓటు వినియోగించుకోవాలని కోరారు.

ఏర్పేడులో..

ఏర్పేడు: పోలింగ్‌కు సర్వం సిద్ధమైనట్లు తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్‌రాజు ఆదివారం తెలిపారు. ఎన్నికల్లో 43, 484 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు వివరించారు. ఎన్నికల నిర్వహణ కోసం 52 పోలింగ్ బూత్‌లు, బూత్‌ల్లో సీసీ కెమెరాలు, తాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, క్యూలు, వైద్య సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ స్టేషన్‌ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.



మాట్లాడుతున్న పోలీసు అధికారులు

రేణిగుంటలో..

రేణిగుంట: సార్వత్రిక ఎన్నికల కోసం మండలంలో అధికార యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని 66 పోలింగ్ కేంద్రాల్లో 61,497మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. ఇప్పటికే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ అదనపు పోలీసు బలగాలు, నిరంతర వీడియో నిఘా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ సిబ్బంది పోలింగ్ సామగ్రితో వారికి కేటాయించిన కేంద్రాలను చేరుకుని ఓటింగ్‌కు ఏర్పాట్లు చేసుకున్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలో సోమవారం జరగనున్న ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికలకు సర్వం సిద్ధం చేసినట్లు అదనపు ఎన్నికల అధికారి పటాన్ అహ్మద్ ఆలీఖాన్ తెలిపారు. మండలంలో 26,088 మంది ఓటర్లలుండగా అందులో మహిళలు 13,453 మంది, పురుషులు 12,633 మంది, ఇద్దరు ట్రాన్స్‌జండర్లు ఉన్నారు. 35 పోలింగ్ స్టేషన్లను ఐదు రూట్లుగా విభజించి, ఐదుగురు జోనల్ అధికారులు, ఐదుగురు రూట్ అధికారులు, ఒక్కో బూత్‌కు పీఓ, ఏపీఓ, ఓపీఓ, పోలీసు, వైద్య సిబ్బందితో కలిపి 10 మంది ఉంటారని తెలిపారు. మొత్తం 350 మంది ఉంటారు. వీరికి సహాయకులుగా బీఎల్వోలు, వీఆర్‌ఏ ఉంటారన్నారు.

సమస్యాత్మక గ్రామాలు

మండలంలోని 35 పోలింగ్ స్టేషన్లలో 6 పోలింగ్ స్టేషన్లను సమస్యాత్మకంగా గుర్తించారు. వీటిలో ఆలత్తూరు, కంచనపుత్తూరు, పార్లపల్లి, పల్లమాల, నీర్పాకోట, కొత్తపాళ్లెం గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ ఎలాంటి గొడవలు జరగకుండా అదనపు పోలీసు బందోస్తు ఏర్పాటు చేశారు.

అన్ని కేంద్రాల్లో వసతుల కల్పన

మండలంలోని 35 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల నిర్వహణకు వసతులు కల్పించారు. పోలింగ్ స్టేషన్‌లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. ఓటరు ఓటు వేయటం కోసం బారికేట్లను ఏర్పాటుచేసి, క్యూ పద్ధతిని అమలు చేస్తారు.

దివ్యాంగుల కోసం వీల్‌చైర్స్

మండలంలోని 35 పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, నడవలేని వృద్ధులు ఓటు వేయడం కోసం వీల్‌చైర్స్ అందుబాటులో ఉంటాయి.



నాగలాపురం: పోలింగ్ కేంద్రంలో నీడ కోసం వేసిన షామియానా

నాగలాపురంలో..

నాగలాపురం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం జరగనున్న ఎన్నికల ప్రక్రియకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి నరసింహులు తెలిపారు. పోలింగ్‌కు కావాల్సిన సామగ్రితో సిబ్బంది పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారని చెప్పారు. ఓటర్లు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు వేయాలని తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ముగిసేంతవరకు పోలింగ్ కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉన్నట్లు ఎస్ఐ టి.ఓబయ్య తెలిపారు. ప్రజలు గుంపులు గుంపులుగా తిరగకూడదన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని ఆయన కోరారు.

వరదయ్యపాళెంలో..

వరదయ్యపాళెం: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం చేసినట్లు తహసీల్దార్ ఉదయ భారతి తెలిపారు. మండలంలోని 46 పోలింగ్ స్టేషన్లలో ఆదివారం ఆమె ఏర్పాట్లను పర్యవేక్షించారు. పోలింగ్ కేంద్రాల బయట ఓటర్లు నిల్చుకోవడానికి బారిగేడ్లు, పోలింగ్ స్టేషన్ లోపల ఈవీఎంలకు టేబుళ్లు తదితర ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి, ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లను చేపట్టినట్లు తెలిపారు. ఆమె వెంట డిప్యూటీ తహసీల్దార్ శాంతి, ఆర్‌ఐలు వెంకటసుబ్బయ్య, జయప్రకాష్, సిబ్బంది ఉన్నారు.







బుచ్చినాయిడుకండ్రిగలోని పోలింగ్ కేంద్రంలో వేసిన షామియానా, పోలింగ్ కేంద్రంలో ఉన్న వీల్‌చైర్, ఓటింగ్‌కు సిద్ధంగా ఉన్న యానాదివెట్టు పోలింగ్ బూత్





పోలింగ్ సామగ్రిని తీసుకెళుతున్న సిబ్బంది, పోలింగ్ సామాగ్రి





ఈవీఎంలను అందజేస్తున్న ఆర్డీఓ రవిశంకర్‌రెడ్డి, సంతకాలు చేస్తున్న పోలింగ్ సిబ్బంది





ఆమందూరు పోలింగ్ కేంద్రం వద్ద క్యూలు, ఆమందూరు పోలింగ్ కేంద్రానికి చేరుకుంటున్న సిబ్బంది





గాజులమండ్యం హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో ఏర్పాట్లు, క్యూలు

దొంగ ఓట్లకు ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు



సిబ్బందికి ఎన్నికల సామగ్రి పంపిణీ పరిశీలిస్తున్న ఆర్‌ఓ అదితిసింగ్

తిరుపతి తుడా: దొంగ ఓటు వేసేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తిరుపతి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అదితిసింగ్ హెచ్చరించారు. పోలింగ్ కేంద్రాల వద్ద నిబంధనలు అతిక్రమించినా, అవాంచనీయ సంఘటనలకు పాల్పడినా కేసులు నమోదు చేస్తామని ఆమె తెలిపారు. ఎస్వీ ఆర్ట్స్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన పోలింగ్ సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్‌ఓ మీడియాతో మాట్లాడుతూ పోలింగ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు, జాగ్రత్తలు తీసుకున్నామని, సోమవారం ఉదయం 5.30 గంటలకు మాక్ పోలింగ్ మొదలవుతుందన్నారు. అభ్యర్థులు, వారి ఏజెంట్లు 5.30 కే హాజరు కావాలని, ఎవ్వరైనా హాజరు కాకపోతే మరో 15 నిమిషాల తర్వాత మాక్ పోల్ నిర్వహిస్తామన్నారు. మాక్ పోల్ అనంతరం ఉదయం 7 నుండి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ ఉంటుందన్నారు. నియోజకవర్గంలో 3,02,503 మంది ఓటర్లు ఉండగా మొత్తం 274 పోలింగ్ కేంద్రాలున్నాయని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. తిరుపతి అర్బన్ తహశీల్దార్ నారాయణ రెడ్డి, ఎలక్షన్ మాస్టర్ ట్రైనర్ చంద్రమౌళి, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య పర్యవేక్షించారు.

అమ్మవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



అలయంవెలుపల హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరేంద్ర

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నరేంద్ర దర్శించుకున్నారు. ఆలయం వద్దకు చేరకున్న ఆయనకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ఆలయ ధ్వజస్తంభం వద్ద మొక్కుకుని, అమ్మవారి మూలమూర్తిని దర్శించుకున్నారు. దర్శనానంతరం ఆలయ ఆశీర్వాద మండపంలో వేద పండితులు ఆశీర్వచనం పలకగా, అధికారులు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

వేడుకగా భాష్యకార్ల ఉత్సవం

తిరుపతి కల్చరల్: శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో ఆదివారం భాష్యకార్ల(శ్రీరామానుజాచార్యుల) ఉత్సవం ఘనంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా ప్రతి రోజు ఉదయం 7 నుంచి 8 గంటల వరకు భాష్యకార్ల వారిని బంగారు తిరుచ్చిపై ఆలయ చిన్న మాడ వీధి ఉత్సవం, సాయంత్రం 5.30 నుంచి రాత్రి 7గంటల వరకు పెద్ద మాడవీధి ఉత్సవం నిర్వహించారు. ఉదయం ఊరేగింపు అనంతరం ఆలయంలో తిరుమంజనం, శాత్తుమొర, ఆస్థానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తిరుమల చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ధనుంజయ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి గంగ జాతర పోస్టర్లు ఆవిష్కరణ



గంగ జాతర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆలయ ఈఓ కె.మమత, వ్యాపార సంస్థల ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: తిరుపతి గ్రామదేవత శ్రీతాతయ్యగుంట గంగమ్మకు మంగళవారం చేపట్టే చాటింపుతో అమ్మవారి గంగజాతర ఆరంభం కానుంది. భక్తుల కోర్కెలు తీర్చే కల్పవల్లి గంగమ్మ తల్లి జాతరను పురస్కరించుకొని తిరుపతి నగరంలోని వ్యాపార సంస్థలు అమ్మవారి జాతర ప్రచారం పోస్టర్లు, కరపత్రాలు, ఆహ్వాన పత్రికలు, బారికేడ్లు, డస్ట్‌బిన్స్ తదితర సామగ్రిని ఆలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతర పోస్టర్లు, కరపత్రాలు, ఆహ్వాన పత్రికలను ఆలయ ఈఓ కె.మమత వ్యాపార సంస్థల ప్రతినిదులతో కలిసి ఆవిష్కరించారు. శుభమస్తు షాపింగ్ మాల్ అధినేతలు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవికుమార్ ఆధ్వర్యంలో 25 బారికేడ్లు, 2 వేల పోస్టర్లు, 25 డస్ట్‌బిన్లు, ఒక వాటర్ కూలర్ అందించారు. అలాగే సీఎంఆర్ షాపింగ్ మాల్ వారు 17 బారికేడ్లు, రెండువేల పోస్టర్లు, కరపత్రాలు అందజేశారు. మెడిమిక్స్ సంస్థ వారు జాతర ఆహ్వాన బుక్‌లెట్స్, 2 వేల పోస్టర్లు, 20 బ్యానర్లు, అభిరుచి ఫుడ్స్ వారు ప్రసాదం బ్యాగులు, జాతర కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఈఓ కె.మమత మాట్లాడుతూ భక్తుల కోర్కెలు తీర్చే తిరుపతి గ్రామదేవత గంగమ్మ తల్లి జాతర సందర్భంగా వ్యాపార సంస్థలు తమ వంతు సాయంతో సహకారం అందించి అమ్మవారిపై తమ భక్తిని చాటుకోవడం అభినందనీయమన్నారు. వారం రోజులపాటు అత్యంత వేడుకగా జరిగే అమ్మవారి జాతర మరింత వైభవంగా జరగాలని ఆకాంక్షిస్తూ జాతర ప్రచారానికి అవసరమైన పోస్టర్లు, కరపత్రాలు, ఆహ్వాన బుక్ లెట్స్, అందించడంతోపాటు జాతరలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా బారికేడ్లు అందించడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, శుభమస్తు మేనేజర్ మునిశంకర్, సీఎంఆర్ మేనేజర్ బాలకృష్ణ, వెంకటేష్, మోహన్, మెడిమిక్స్ సంస్థ ప్రతినిధులు మధుసూదన్, నరేంద్రబాబు, కరుణకుమార్ బాలమురుగన్, అభిరుచి ఫుడ్స్ సిబ్బంది పాల్గొన్నారు.